సమస్యలు పరిష్కరించాలి

అల్లాపూర్, జూన్ 18: అల్లాపూర్ డివిజన్‌లోని రామారావునగర్, న్యూరామారావునగర్, హరినగర్, రాధాకృష్ణారావునగర్‌లో నీటి సరఫరాలో సమయపాలనలేదని, గతం లోగా సాయంత్రం 7గంటల లోపు నీటి సరఫరా అయ్యేలా చూడాలంటూ ఆయా కాలనీల ప్రతినిధులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీల ప్రతినిధులు మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న కరెంటు సమస్య, నిలిచిపోయిన కాలువ నిర్మాణం ప్రారంభించాలని కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తారని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కూకట్‌పల్లి బీసీ సెల్ అధ్యక్షుడు నాగుల సత్యం, వి.రామారావునగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటయ్య యాదవ్, ఎ.సంజీవ, భిక్షపతి, రాజా, చారి, శివ పాల్గొన్నారు.

మహాశక్తి పీఠాన్ని సందర్శించిన
నాగసాధువులు

దుండిగల్, జూన్ 18: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, నిజాంపేట్‌లోని ఆదిజాంభవ అరుంధతి మాత మహాశక్తి పీఠాన్ని మంగళవారం నాగసాధువులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆదిజాంభవ అరుంధతి మాత మహాశక్తి పీఠం అభివృద్ధికి కృషి చేస్తున్న పీఠాధిపతి గజ్జెల రాజయ్య జాంభవను అభినందించడంతో పాటు ఆశీర్వచనాలు అందజేశారు.

చైన్ స్నాచింగ్

కొండాపూర్, జూన్ 18: మహిళా ఉద్యోగిని మెడలోంచి చైన్ లాక్కెళ్లిన ఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. చందానగర్ శివాజీనగర్‌లో నివాసం ఉండే తులసీలక్ష్మి (28) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం తులసీలక్ష్మి విధులు ముగించుకుని శివాజీనగర్‌లోని తన నివాసానికి నడుచుకుంటూ వెళ్తున్నది. ఈ క్రమంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆమెను వెంట వెళ్లి ఎవరూలేరని నిర్ధారించుకొని ఆమె మెడలోని 3 తులాల బంగారు గొలుసును లాక్కెళ్లారు. స్నాచింగ్ జరిగి ఒకరోజు గడుస్తున్నప్పటికీ పోలీసులు ఎలాంటి వివరాలు వెల్లడించకుండా, గోప్యతగా వ్యవహరిస్తున్నారు. పోలీసుల నిఘా లోపంతోనే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఆసరాకు నిరీక్షణ

- గంటల తరబడి క్యూ.. ఇబ్బందులు పడుతున్న వృద్ధులు, వికలాంగులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

నిజాంపేట్ వార్డు కార్యాలయం వద్ద మంగళవారం బారులు తీరిన పింఛన్‌దారులు

దుండిగల్, జూన్ 18 : ఆసరా పింఛన్‌దారులకు నిరీక్షణ తప్పడంలేదు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులకు, వికలాంగులకు అందిస్తున్న ఆసరా పెన్షన్ ఎప్పుడు వస్తుందో... పోస్ట్ ఆఫీస్ వారు ఎప్పుడు ఇస్తారో తెలియక ఆసరా పింఛన్‌దారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు పెన్షన్ వచ్చినప్పటికీ మిషన్లు పనిచేయక, నెట్వర్క్ లేక గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడటం, ఫోస్ట్ ఆఫీస్ సిబ్బందిని ఇదేమని అడిగితే పెన్షన్‌దారుల పైన చికాకు పడటం నిత్యం పరిపాటిగా మారింది. సరే తరువాత వచ్చి తీసుకుందామని భావిస్తే ఇక అంతే సంగతులు. వరుసగా రెండు నెలలు పెన్షన్ డబ్బులు తీసుకోకుంటే ఉన్న పెన్షన్ కాస్త మొత్తం పోతుందేమోనని భయంతో వృద్ధులు, వికలాంగులు గంటల తరబడి లైన్‌లో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. గతంలో పెన్షన్ అమౌంట్ సంబంధిత పెన్షన్ దారుడి బ్యాంక్ అకౌంట్‌లో డిపాజిట్ చేయడానికి పెన్షన్‌దారుల నుంచి బ్యాంక్ అకౌంట్‌కు సంబంధించిన పూర్తి సమాచారం తీసుకున్నప్పటికీ ఇప్పటి వరకు అది ఆచరణకు నోచుకోవడం లేని పలువురు పింఛన్‌దారులు వాపోతున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో బ్యాంక్ అకౌంట్‌లో పెన్షన్ డబ్బులు జమ చేస్తున్నప్పటికీ నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌లో మాత్రం పెన్షన్ కోసం రోజుల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇదే విషయాన్ని అనేక మార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ అధికారులు ప్రజా ప్రతినిధులలో ఎలాంటి చలనం లేకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా పెన్షన్ దారుల అకౌంట్‌లో డబ్బులు డిపాజిట్ చేసే విధంగా కార్పొరేషన్ కమిషనర్ వెంటనే చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. కాగా, ఇదే విషయమై నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావును వివరణ కోరేందుకు యత్నించగా స్పందించకపోవడం గమనార్హం.

బస్సు సర్వీసు పునరుద్ధరించాలి

కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మానగర్ ఫేస్-2 రింగ్‌రోడ్డు నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని కోరుతూ మంగళవారం పద్మానగర్ ఫేస్-2 కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ.. పద్మానగర్ ఫేస్-2 నుంచి నిత్యం వందలాది మంది కార్మికులు, విద్యార్థులు, ఉద్యోగులు బస్సులో ప్రయాణం చేస్తారన్నారు. గతంలో ఇక్కడ ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉండేదని, కరోనా సమయంలో దానిని తాత్కాలికంగా నిలిపివేశారని, దీని కారణంగా ప్రతిరోజు ఉదయం, సాయంత్రం సమయంలో ఇక్కడి నుంచి ప్రయాణాలు కొనసాగించాలంటే స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సికింద్రాబాద్, అఫ్జల్‌గంజ్, కోఠి ప్రాంతాలకు ఇక్కడి నుంచి బస్సు సర్వీసును పునరుద్ధరించేలా తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరడంతో స్పందించిన ఆయన ఆర్టీసీ ఉన్నతాధికారులతో ఫోన్‌లైన్‌లో మాట్లాడారు. కాలనీ ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి, కోశాధికారి సంజీవ్‌కుమార్, సభ్యులు దుర్గాప్రసాద్, మల్లారెడ్డి, దుర్గారెడ్డి, శోభన్, వీరేశ్ పాల్గొన్నారు. – కుత్బుల్లాపూర్, జూన్18

మెరుగైన విద్యుత్ సరఫరాకు కృషి

నానక్‌రాంగూడ సుమధుర అపార్టుమెంట్స్ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

శేరిలింగంపల్లి, జూన్ 18: విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, ప్రధానంగా నానక్‌రాంగూడ సుమధుర అపార్టుమెంట్ ప్రాంతంలో తరుచూ తలెత్తుతున్న సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. మంగళవారం గచ్చిబౌలి డివిజన్‌లోని నానక్‌రాంగూడ సుమధుర అపార్టుమెంట్స్ వాసుల విజ్ఞప్తి మేరకు ఆయన పర్యటించారు. సుమధుర అపార్టుమెంట్ ప్రాంతంలో నిత్యం విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, రోజుకి 18 సార్లు కరెంట్ పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతోపాటు నిత్యం లోఓల్టేజీ సమస్య ఏర్పడుతుందని, ఈ విషయమై తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గాంధీని కోరారు. విద్యుత్ అంతరాయం తీవ్రంగా ఉందని, ఫలితంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. దీంతో విద్యుత్ సమస్య శాశ్వత పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత విద్యుత్ శాఖ అధికారులను ఎమ్మెల్యే గాంధీ ఆదేశించారు. మెరుగైన విద్యుత్ సరఫరా నానక్‌రాంగూడలో అందించేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఓ నూతన సబ్‌స్టేషన్‌ను ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, విద్యుత్ శాఖ ఏడీఈ చరణ్, ఏఈ వేణుగోపాల్, సుమధుర అపార్టుమెంట్ ప్రతినిధులు పీవీ చౌదరి, రామారావు, దేవిరెడ్డి, సుబ్బారెడ్డి, ప్రదీప్‌కుమార్, ఎంఎస్‌రావు, రాంనారాయణ, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల్లో ప్రతిభను వెలికితీయాలి

ప్రముఖ నిర్మాత, ఆర్కా మీడియా సీఈఓ శోభు యార్లగడ్డ

దివ్యాంగ క్రీడాకారులతో ప్రముఖ నిర్మాత శోభు యార్లగడ్డ, ఎన్‌వీఎస్ లీజినల్ డైరక్టర్ గోపాలకృష్ణ

శేరిలింగంపల్లి, జూన్ 18: దివ్యాంగుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ నిర్మాత, ఆర్కా మీడియా సీఈఓ శోభు యార్లగడ్డ అన్నారు. జవహర్ నవోదయ విద్యాలయ సమితి, ఆదిత్య మెహతా ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని జేఎన్‌వీ రంగారెడ్డి క్యాంపస్‌లో నిర్వహించిన పారా స్పోర్ట్స్ ప్రతిభ గుర్తింపు, శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ పారాస్పోర్ట్స్ ప్రత్యేక శిక్షణ శిబిరం ఎంతగానో దోహదపడుతుందన్నారు. దివ్యాంగ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. ఆదిత్యా మెహత ఫౌండేషన్, నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఈ ప్రత్యేక శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నవోదయ విద్యాలయ సమితి రీజినల్ డిప్యూటీ కమిషనర్ టి.గోపాలకృష్ణ, నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ విజయభాస్కర్, ఆదిత్యా మెహతా, పలువురు ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులతో తెలంగాణకు లాభం

జగద్గిరిగుట్ట, జూన్ 18 :తెలంగాణ ప్రాంత కేంద్ర మంత్రుల సహకారంతో రాష్ట్రానికి లాభం వస్తుందని బీజేపీ నేతలు అన్నారు. కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం జరగ్గా.. జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి అతిథిగా హాజరయ్యారు. పార్టీని బలోపేతం చేయడంతోపాటు ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కేంద్ర మంత్రులు హైదరాబాద్ రాక సందర్భంగా ఈనెల 20న జరిగే కార్యక్రమానికి నేతలు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శేషగిరి, సుబ్బారావు, రాజిరెడ్డి, పున్నారెడ్డి, బలరాం,సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ ఆలయం వార్షికోత్సవం

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపల్ పరిధిలోని దుండిగల్ గ్రామంలో మంగళవారం శ్రీ కాశీవిశ్వేశ్వర,శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వజరిగాయి. ఈ వేడుకలకు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు,కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద ముఖ్య అతిథిగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రజా ప్రతినిధులు,నాయకులు,ఆలయ కమిటీ సభ్యులు,భక్తులు పాల్గొన్నారు.
– దుండిగల్, జూన్ 18

డ్రైనేజీ సమస్యను సత్వరమే పరిష్కరించాలి

డ్రైనేజీ సమస్యను సత్వరమే పరిష్కరించనున్నట్లు ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని గౌతంనగర్‌లో డ్రైనేజీ సమస్య ఉందని స్థానికులు తెలియజేసిన సందర్భంగా ఆయన ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గౌతంనగర్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యను సత్వరమే పరిష్కరించాలని జలమండలి అధికారులను ఆదేశించారు. అంజయ్య, సురేశ్‌గౌడ్, గోపాల్, సురేందర్‌నాయుడు, వీరేశంగుప్త పాల్గొన్నారు. – బాలానగర్, జూన్ 18

ఝాన్సీ లక్ష్మీబాయి పోరాటం స్ఫూర్తిదాయకం

స్వతంత్ర సంగ్రామంలో వీరవనిత ఝాన్సీలక్ష్మీబాయి పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమని కూకట్‌పల్లి నియోజకవర్గం జనసేనా ఇన్‌చార్జి ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ అన్నారు. మంగళవారం కేపీహెచ్‌బీ కాలనీలోని జనసేనా కార్యాలయంలో ఝాన్సీలక్ష్మీబాయి వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేనా నేతలు, వీర మహిళలు ఉన్నారు. – కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 18

కార్మికులకు అండగా ఉంటా

కష్టాలలో ఉన్న కార్మికుల కుటుంబాలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని బీఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం రాష్ట్ర నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ అన్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ కలకల్‌లోని మహాలక్ష్మి ప్రైవేట్ లిమిటెడ్(ఎంపీఎల్)కంపెనీలో ఒడిశాలోని బలాసూర్‌కు చెందిన అజయ్‌కుమార్ రావత్ పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు మరణించాడు. మృతి చెందిన కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవడంలో కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. బాధిత కుటుంబసభ్యులు పలుమార్లు కంపెనీ యాజమాన్యాన్ని సంప్రదించినా ఫలితం లేకపోవడంతో కార్మిక సంఘం నాయకులను కలిశారు. రంగంలోకి దిగిన కార్మిక సంఘం నాయకులు కంపెనీ యాజమాన్యంతో చర్యలు జరిపి బాధిత కుటుంబానికి రూ.7.50లక్షల నష్టపరిహారాన్ని అందించేలా ఒప్పించారు. మంగళవారం మృతి చెందిన కార్మికుడి భార్య గీతాంజలికి రూ.7.50లక్షల నష్టపరిహారం చెక్కును అందజేశారు. దీంతో బాధిత కార్మికుడి కుటుంబసభ్యులు రవిసింగ్ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్మిక సంఘం నేతలు అనిల్,జగన్, సుదర్శన్, కిరణ్ తదితరులు ఉన్నారు. – కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 18

గచ్చిబౌలి స్టేడియం వేదికగా ఐటీఎఫ్ జాతీయ పారా టోర్నీ మంగళవారం ఘనంగా ముగిసింది. బాలికల సబ్‌జూనియర్ అక్వాథ్లాన్ విభాగంలో తెలంగాణకు చెందిన జోహాన్న షిజు రజత పతకంతో మెరిసింది. మిగతా విభాగాల్లో దుర్విశ పవార్, సోరమ్, నెల్లి, తొకోచామ్ గౌతమ్, అథర్వ్ షాజి పాటిల్, స్నేహల్ జోషి, రోషన్ గోండ్ పసిడి పతకాలు కైవసం చేసుకున్నారు. విజేతలకు ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి పతకాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రయథ్లాన్ అధ్యక్షుడు మదన్‌మోహన్, శ్రీనివాస్ గౌడ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. – హైదరాబాద్, ఆట ప్రతినిధి

తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉప్పుగూడ వేదికగా జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నీలో భారత క్రీడా ప్రాధికార సంస్థ(సాయ్) జట్టు విజేతగా నిలిచింది. మంగళవారం జరిగిన టోర్నీ ఫైనల్లో సాయ్ టీమ్ 41-35 తేడాతో నవశక్తి క్రీడామండలిపై విజయం సాధించింది. విజేత, రన్నరప్ జట్లకు రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి జగదీశ్వర్‌యాదవ్ ట్రోఫీలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సతీశ్‌కుమార్, మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. – హైదరాబాద్, ఆట ప్రతినిధి

జోరుగా అక్రమ నిర్మాణాలు

- బాలానగర్‌లో అందినకాడికి దండుకుంటున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది
- ప్రభుత్వ ఖజానాకు గండి

బాలానగర్, జూన్ 18 : అక్రమ నిర్మాణాలు టౌన్‌ప్లానింగ్ అధికారులకు కాసులు కురిపిస్తున్నాయి. కూకట్‌పల్లి సర్కిల్ పరిధి బాలానగర్ డివిజన్‌లో అక్రమ నిర్మాణాలను టౌన్‌ప్లానింగ్ అధికారులే ప్రోత్సహిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులే ప్రోత్సహిస్తుండటంతో ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతున్నది. దీంతోపాటు నిర్మాణదారులకు అడ్డూ అదుపూ లేకుండాపోతుంది. అనుమతులు ఒకలా తీసుకొని నిర్మాణాలు మరోలా చేపడుతుండటంతో టౌన్‌ప్లానింగ్ అధికారులకు జేబులు నిండుతున్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులకు చేతులు తడిపితే చాలు యథేచ్ఛగా నిర్మాణాలు చేసుకోవచ్చని నిర్మాణదారులు భావిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని బాలానగర్ డివిజన్‌లో అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నా వాటిని అడ్డుకున్న దాఖలాలులేవని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాలానగర్ డివిజన్ పరిధిలోని ఫిరోజ్‌గూడ పూల్‌బాగ్‌కాలనీ, నవజీవన్‌నగర్, వినాయక్‌నగర్, సాయినగర్, కళ్యాణ్‌నగర్‌లలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయి. అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న టౌన్ ప్లానింగ్ విభాగం అధికారుల పనితీరు పట్ల ప్రజల్లో విశ్వాసం పోయిందని పలువురు స్థానికులు బహిరంగంగానే మాట్లాడుకోడం విశేషం. చైన్‌మెన్ నుంచి మొదలుకొని అధికారుల వరకు అందరూ ఎవరి స్థాయిలో వారు అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించి అందినకాడికి దండుకోవడమే పనిగా పెట్టుకున్నారని పలువురు విమర్శిస్తున్నారు. డివిజన్‌లో భవన నిర్మాణాలు ఎక్కడెక్కడ ఉన్నాయో తెలుసుకునే పనిలో చైన్‌మెన్ ఉంటూ, నిర్మాణ దారుడికి అధికారులకు మధ్య లావాదేవీలు నడిపించడమే చైన్‌మెన్ ముఖ్య విధిగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. భవన నిర్మాణదారుడు, బిల్డర్లు చైన్‌మెన్‌ను, అధికారులను కలిస్తే సరే.. లేదంటే నోటీసులు జారీ చేయడం, ఆ తర్వాత పనులు నిలిపివేసి ఇబ్బందులకు గురి చేయడం అలవాటుగా మారిందని పలు పేర్కొంటున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు ఇప్పటికైనా ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా అమలు చేసేలా చర్యలు చేపట్టి అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఫూల్‌బాగ్ కాలనీలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణం

కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 18 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో మంగళవారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 55, వంకాయ 28, బెండకాయ 55, పచ్చిమిర్చి 85, బజ్జి మిర్చి 70, కాకరకాయ 65, బీరకాయ 72, క్యాబేజి 23, ఫ్రెంచ్ బీన్స్ 155, క్యారెట్ 40, కాలీఫ్లవర్ 28, దొండ 45, చిక్కుడు 70, గోరుచిక్కుడు 55, బీట్‌రూట్ 23, క్యాప్సికం 75, ఆలుగడ్డ 35, కీరా 33, దోసకాయ 23, సొరకాయ 17, పొట్లకాయ (1) 23, కందగడ్డ 50, ఉల్లిగడ్డ 39, మామిడికాయ(1)10 నుంచి 15, అరటికాయ(1) 9 నుంచి 11, చామగడ్డ 37, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 40, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు (12) 50 నుంచి 60, మునగకాయ(1) 5 నుంచి 6, పచ్చి బఠాని –, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 180, వెల్లుల్లి 240, చింతపండు 120, కరివేపాకు 80గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

ముంపు సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి



సమీక్షా సమావేశంలో కార్పొరేటర్ సత్యనారాయణ, డీసీలు కృష్ణయ్య, మోహన్‌రెడ్డి

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 18:వర్షాకాలంలో ముంపు సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ కోరారు. మంగళవారం కూకట్‌పల్లి వార్డు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో డీసీ కృష్ణయ్య, ఎస్‌డబ్ల్యూఎం జోనల్ డీసీ మోహన్‌రెడ్డి, కార్పొరేటర్ సత్యనారాయణ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ... వర్షాకాలంలో ఎదురయ్యే ముంపు సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు మందుస్తు చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైనేజీ పైప్‌లైన్‌ల నుంచి బయటకు తీసిన మురుగు వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. రోడ్లపై గుంతలను పూడ్చాలని, దెబ్బతిన్న రోడ్లు, డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌ను మరమ్మతులు చేయాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా ముందస్తుగా యాంటీ లార్వా ఆపరేషన్ పనులు క్రమం తప్పకుండా చేయాలన్నారు. కూలిన చెట్ల కొమ్మలను వెంటనే తొలగించాలన్నారు. కాలనీలు, బస్తీల్లో విద్యుత్ విధిదీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏఎంహెచ్‌వో మమత, జలమండలి డీజీఎం వెంకటేశ్వర్‌రావు, స్ట్రీట్‌లైట్స్ ప్రియాంక, ఎంటమాలాజీ ఏఈ ఉషారాణి, పారిశుధ్య విభాగం సిబ్బంది, బీఆర్ఎస్ పార్టీ నేతలు ప్రభాకర్, శ్రీధర్‌రెడ్డి, కృష్ణ, శేఖర్, నర్సింహాగౌడ్ తదితరులు ఉన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఉన్నికృష్ణ. చిత్రంలో రేవతి తదితరులున్నారు..

దుండిగల్, జూన్ 18 : తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ దుండిగల్ ఏరియా సమావేశం మంగళవారం షాపూర్‌నగర్‌లోని కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేవతి, కోశాధికారి ఉన్నికృష్ణ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో పీహెచ్‌సీలలో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు నెలనెల వేతనాలు ఎప్పుడు వస్తాయో తెలియక ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆశా వర్కర్లు ఆర్థిక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని, రాష్ట్రంలో సుమారు 30వేల మంది ఆశా వర్కర్లు గత 18 ఏండ్ల నుంచి ఎన్‌హెచ్ఎం స్కీం ద్వారా పేదలకు ఆరోగ్య సేవలందిస్తున్నారన్నారు. ఇప్పటివరకు వీరికి కనీసం ఫిక్స్‌డ్ వేతనాన్ని ప్రభుత్వం నిర్ణయించలేదని, పీఎఫ్, ఈఎస్ఐ తదితర సౌకర్యాలు సైతం లేవన్నారు. ఈ పరిస్థితుల్లో ఒక కుటుంబం బతకాలంటే కనీసం రూ.26వేలు ఉంటే సాధ్యమవుతుందని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయని, కానీ ఈ అంశాన్ని పరిశీలించి పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆశా వర్కర్లు సంఘటితంగా ఉండి తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్, దుండిగల్ పీహెచ్‌సీకి చెందిన ఆశావర్కర్లు హంస, పద్మ, విజయ, సునీత, లక్ష్మి, రేణుక, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి అద్దె చెల్లించలేదని యజమాని మందలింపు.. వ్యక్తి ఆత్మహత్య

దుండిగల్,జూన్18: ఆర్థిక ఇబ్బందులతో ఇంటి అద్దె చెల్లించలేక ఓ యజమానితో అవమానకరంగా మాట్లాడటంతో మనస్థాపానికి గురై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం..ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా, రాజమండ్రి సమీపంలోని గోకవరం గ్రామానికి చెందిన దాసరి శైలజ, వరప్రసాద్(45) దంపతులు. గత కొంత కాలం కిందట ఉపాధి కోసం వలసవచ్చి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, బాచుపల్లి శ్రీసాయినగర్ సమీపంలోని వసంత్‌నగర్ కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నివాసముంటున్నారు. వీరికి ఒక కొడుకు(15) ఉన్నాడు. వరప్రసాద్ రియల్‌ఎస్టేట్ చేస్తుండగా.. శైలజ గృహిణి. అయితే వరప్రసాద్ కుటుంబం కొంత కాలంగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నది. ఈ నేపథ్యంలో వరప్రసాద్ నివాసం ఉంటున్న ఇంటికి గత మూడునాలుగు నెలలుగా కిరాయి చెల్లించడంల